క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఏర్పాటు



స్థానిక లయన్స్ ఆదర్శ క్లబ్ నూతన కార్యవర్గం

ఆకివీడు: లయన్స్ ఆదర్శ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటయ్యింది. క్లబ్ అధ్యక్షురాలిగా విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు కాకర్ల రాజ రాజేశ్వరి, కార్యదర్శిగా మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, కోశాధికారిగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు ముదునూరి వెంకట సూర్య నాగమణితో కార్యవర్గం ఏర్పడింది. సంయుక్త కార్యదర్శిగా ఎస్వీజీ.అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులుగా కేపీ.చంద్రశేఖర్, టీ.జితేంద్రబాబు, మెంబర్ షిప్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల రామచెంచయ్య, కార్యవర్గ నియామకం జరిగింది. త్వరలోనే నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేయనుందని ప్రస్తుత కమిటీ అధ్యక్షుడు మోటుపల్లి శ్రీనివాసరావు శుక్రవారం చెప్పారు.

అభివృద్ధే మా లక్ష్యం



విలేకర్లతో మాట్లాడుతున్న మండల కమిటీ అధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాద్

ఆకివీడు: అభివృద్ధే లక్ష్యంగా రానున్న రోజుల్లో పనిచేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తామని మండల టీడీపీ అధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కార్యకర్తలు, నాయకులు చిత్తశుద్ధితో పని చేశారన్నారు. సమావేశంలో బొల్లా వెంకట్రావు, గొంట్లా గణపతి, బొర్రా సుజాత, భూపతిరాజు తిమ్మరాజు, గంధం ఉమా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మోదీకి శుభాకాంక్షలు

భీమవరం: నరేంద్రమోదీని ఎన్డీఏ కన్వీనర్‌గా ఎన్నుకున్న సందర్భంగా పార్లమెంట్ కన్వీనర్ సుభాష్ ఆధ్వర్యంలో నర్సాపురం పార్లమెంట్ పార్టీ కార్యాలయం వద్ద సంబరాలు నిర్వహించారు. టపాసులు కాల్చి, స్వీట్స్ పంచుకొని నరేంద్ర మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కాయిత సురేంద్ర, పితాని వెంకటేశ్వరరావు, షేక్ మొహిదీన్,పెద్దేటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భోజనం పొట్లాల పంపిణీ



పేదలకు భోజనం పొట్లాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: ప్రపంచ ఆహార భద్రత దినోత్సవ సందర్భంగా విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలోని గొల్లవాని తిప్ప రోడ్‌లో పేదకుటుంబాలకు శుక్రవారం భోజనం పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవాసంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ మానవునికి ప్రధాన అవసరాలైన నీరు, ఆహారం వంటివాటి విషయంలో ప్రజలు భద్రతలు పాటించాలన్నారు. ఆహార భద్రత దినోత్సవ సందర్భంగా హర్షిత ఫుడ్స్ సహకారంతో పేద కుటుంబాలకు భోజనాన్ని పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు ఇందుకురి శివాజీవర్మ, వాల్మీకి బాలాజీ, మానవతా సాయి తదితరులు పాల్గొన్నారు.

ఈ పోస్ట్ ద్వారా ప్రజాప్రతినిధులకు అభినందనలు

భీమవరం: సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులకు ఈ పోస్ట్ ద్వారా అభినందనలు తెలిపేందుకు తపాలాశాఖ వినూత్న కార్యక్రమం చేపట్టినట్లు భీమవరం డివిజన్ పోస్టాఫీస్ సీనియర్ సూపరింటెండెంట్ ఎన్వీ సత్యనారాయణరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులకు వారి అభిమానులు కేవలం రూ.10 ఫీజుతో పాటు రూ.2 జీఎస్టీ చెల్లించి పోస్టాఫీసులో ఈ పోస్టు ద్వారా శుభాకాంక్షలు పంపొచ్చన్నారు. పోస్టాఫీసుల నెట్‌వర్క్ ద్వారా ఎల్రక్టానిక్ ట్రాన్స్‌మిషన్, ఫిజికల్ డెలివరీ కలయికతో దేశంలోని ఏ చిరునామాకైనా తమ సందేశాలను పంపొచ్చని సత్యనారాయణరాజు వివరించారు. ఇతర వివరాల కోసం దగ్గరలోని పోస్టాఫీసుల్లో సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థినికి ప్రశంసలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మరపట్ల సుశ్మిత త్రీ ప్రింటింగ్ టెక్నాలజీపై ఏపీ నిట్‌లో జరిగిన శిక్షణా కార్యక్రమంలో ప్రతిభ కనబర్చినట్లు స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్. చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆమెకు కార్తికేయ శర్మ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. విద్యార్థిని సుశ్మితను హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ప్లాస్టిక్ భూతం మనుగడకు విఘాతం

- పెరిగిన ప్లాస్టిక్ వినియోగం
- డంపింగ్ యార్డుల్లో పెరిగి పోతున్న వ్యర్థాలు
- రికార్డులకే పరిమితమైన నిషేధం



ప్లాస్టిక్ వినియోగంపై చిత్రం

వీరవాసరం: పట్టువదలని విక్రమార్కుడి భుజంపై మళ్లీ మళ్లీ ఎక్కే బేతాళుడిలా ప్లాస్టిక్ అందరిపైనా స్వారీ చేస్తోంది. ప్లాస్టిక్ నిషేధం ఉత్తర్వులు ఎక్కడా పూర్తిస్థాయిలో అమలైన జాడ లేదు. దాంతో ప్లాస్టిక్ సమస్యలు నానాటికీ పెరిగిపోతున్నాయి. డ్రెయినేజీల్లో వచ్చే పూడికల్లో ఎక్కువ భాగం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ పరిధిలో ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించాలనే ప్రభుత్వాదేశాలు రికార్డులకే పరిమితమయ్యాయి. నియోజకవర్గ పరిధిలోని పలు దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో అధికారులు ఆకస్మిక దాడులు చేస్తూ ప్లాస్టిక్ విక్రయించే వారిపై భారీగా జరిమానాలు విధించే వారు. కొంత కాలానికి అధికారులు మిన్నకుండిపోవడంతో మళ్లీ కొందరు ప్లాస్టిక్ విక్రయాలను మొదలు పెట్టారు. హ్యాండ్లింగ్ ప్లాస్టిక కవర్స్ వేస్ట్ మేనేజ్‌మెంట్ 2011 నిబంధనల ప్రకారం మండల పంచాయతీ కార్యదర్శులు వ్యాపార దుకాణాలు, మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తుంటే చర్యలు తీసుకోవాలి. అక్కడికక్కడే వాటిని వినియోగిస్తున్న వారిపై జరిమానాలు విధించి వాటిని స్వాధీనం చేసుకుని నాశనం చేయాలి. అయితే ఆ నిబంధనలు పటిష్టంగా అమలు కావడం లేదు. విచ్చలవిడిగా వాటి వినియోగమే కాదు. రీసైక్లింగ్ కూడా జరుగుతోంది. వీటి వినియోగం పర్యావరణానికి చాలా ప్రమాదకరమని, పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ అవగాహన లోపంతో ప్రజలు వీటిని యథేచ్ఛగా వినియోగిస్తున్నారు.

అధికారుల ఉదాసీనతే కారణం

ఈ మధ్యనే మళ్లీ ప్లాస్టిక్ కవర్లపై నిషేధం విధిస్తూ పంచాయతీ శాఖ చర్యలు చేపట్టింది. అయినా గ్రామాల్లో ఏ దుకాణం చూసినా ఏ హోటల్‌లో చూసినా, ఏ చెత్తకుప్ప, మురుగుకాలువను చూసినా ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. కొందరు వ్యాపారులు కవర్లు లేవంటున్నారు. వినియోగదారులు వస్తువులు వదిలి వెళ్లిపోతుంటే కవరు ఇస్తున్నారు. కవర్లు లేకపోతే తమకు వ్యాపారం జరగడం లేదని, వినియోగదారులు ఏ విధమైన సంచులు తీసుకురాకుండా వచ్చి వెళ్లిపోతున్నారని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో చెత్తలో కేవలం ఐదు శాతం కంటే తక్కువ ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తుంటే ఆరు నెలలుగా 30 నుంచి 40 శాతం వరకూ ఇవే ఉంటున్నాయి. ఏ చెత్తకుప్ప చూసినా, మురుగు కాలువను చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి కన్పిస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై అధికారులు కఠినంగా వ్యవహరించకపోవడం వల్లే నిషేధం అమలు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ప్లాస్టిక్ నిషేధాన్ని పటిష్టంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కాగితపు కవర్ల వినియోగాన్ని పెంచాలి



ప్లాస్టిక్ కవర్ల వాడకంపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ప్లాస్టిక్ కవర్లు వాడకం ద్వారా క్యాన్సర్ మహమ్మారి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రీ యూసేబుల్ ప్లాస్టిక్‌ను వాడే విధంగా, లేదంటే కాగితపు కవర్ల వినియోగాన్ని పెంచే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలి. సమాజంలోని ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– పంపన సాయిబాబు, వీరవాసం పాఠశాల ఉపాధ్యాయుడు

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ పి నాగరాజు

పాలకోడేరు: విద్యార్థులకు సెలవుల రోజుల్లో వివిధ పోటీ పరీక్షలు, శిక్షణ శిబిరాలు నిర్వహించడం వల్ల వారిలో సృజనాత్మకత బహిర్గతమవుతుందని పాలకోడేరు మండల విద్యా శాఖాధికారి పి .నాగరాజు అన్నారు. వేసవికాలం సెలవులు సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో బాలబాలికలకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో శుక్రవారం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఖాతాదారులకు సూచనలు

భీమవరం: పట్టణంలోని యూనియన్ బ్యాంక్ రీజనల్ ఆఫీస్ భీమవరం ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ డేని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారి ఖాతాదారులను, వ్యాపారవేత్తలను ఆహ్వానించి, వారికి బ్యాంకు స్కీమ్స్ గురించి వివరించారు. ఖాతాదారుల సూచనలు, సలహాలు తెలిపారు. ఈ సందర్భంగా రీజనల్ హెడ్ సంగీతా కుమారి మాట్లాడుతూ 13వ తేదిన ఎంఎస్ఎంఈ మెగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.డిప్యూటీ రీజనల్ హెడ్ వెంకన్న బాబు, క్రెడిట్ హెడ్ రమేష్, ఎంఎల్‌పి హెడ్ రాకేష్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలతో విజ్ఞానం

ముగింపు సభలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు



స్థానిక మాదివాడ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సభలో పాల్గొన్న వక్తలు

ఆకివీడు: వేసవి సెలవులు విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించాయని నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు అన్నారు. స్థానిక మాదివాడ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పండు మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు వేసవి సెలవులు ఇస్తారన్నారు. సెలవుల్లో విచ్చలవిడిగా తిరగకుండా కొంతమంది విద్యార్థులు తమ విజ్ఞానాన్ని, మేధస్సును పెంపొందించుకునేందుకు శిక్షణ శిబిరాలకు హాజరవడం అభినందనీయమన్నారు. రీడర్స్ ఫోరం అధ్యక్షుడు దాసరి వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ పలు అంశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించి, వారిలో సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు శిక్షణలు తోడ్పడ్డాయని తెలిపారు.అనంతరం విద్యార్థులకు బహుమతులు పాల్గొన్నారు. లయన్స్ ప్రతినిధి, అడ్వకేట్ నెలిల సతీష్ కుమార్, ఉపాధ్యాయులు కిషోర్, అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీతత్వాన్ని పెంపొందించుకోండి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పోటీతత్వాన్ని పెంపొందించుకున్నప్పుడే జీవితంలో ఆశించిన ఫలితాలు సాధించగలమని మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల తెలిపారు. పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో శుక్రవారం వేసవి శిక్షణ ముగింపు సభలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఇటువంటి శిబిరాలు నిర్వహించడం ఎంతో ప్రయోజనకరమన్నారు. తీవ్రమైన ఎండల్లో బాలలు బయట తిరిగితే అనేక ప్రమాదాలు జరుగుతాయని ఇటువంటి శిబిరాలు కారణంగా విద్యార్థులు బయట తిరగకుండా శిబిరంలో పాల్గొంటే విజ్ఞానంతో పాటు క్రీడల్లో ప్రావీణ్య పెంచుకునే అవకాశముందన్నారు. గ్రంథాలయంలో ప్రతి ఏటా నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాలకు గ్రంథాలయ చదువువరుల సంఘం అందజేస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో అవగాహన కల్పిస్తూ మొక్కలు నాటారు. గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరం గతనెల 15వ తేదిన ప్రారంభించగా శుక్రవారం వరకు బాలల్లో సృజనాత్మక శక్తి పెంపొందించే డ్రాయింగ్, డ్యాన్స్, స్పోకెన్ ఇంగ్లీష్ ,యోగా, చెస్, క్యారమ్స్ వంటివాటిలో శిక్షణ ఇచ్చామన్నారు. చదువరుల సంఘం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, శిబిరం కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పిల్లలకు వేసవిలో శిక్షణ తరగతులు నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో వివిధ పోటీల్లో విజేతలైన బాలలకు బహుమతులు, చదువరుల సంఘం తరుపున ప్రశంస పత్రాలు, మొక్కలు అందజేసి రిసోర్స్ పర్సన్స్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చదు వరుల సంఘం సభ్యురాలు పి పద్మ, శ్రీనివాస్, మాధవి, కలిగొట్ల గోపాలశర్మ, షేక్ బాబాజీ, నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

నేర్చుకోవడం విద్యార్థుల ఉత్తమ లక్షణం



వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులతో వక్తలు

ఉండి: ఉపాధ్యాయులు, పెద్దలు చెప్పే ప్రతీ విషయాన్ని విని నేర్చుకోవడం విద్యార్థులకు ఉండాల్సిన ఉత్తమ లక్షణమని యండగండి కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్ కార్యదర్శి సీహెచ్ రవికుమార్ అన్నారు. శుక్రవారం యండగండి శాఖా గ్రంథాలయంలో 24 రోజులు నిర్వహించిన వేసవి శిక్షణ ముంగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యం, యవ్వనంలోనే నేర్చుకొని, చదవుకునే అవకాశం లభిస్తుందని, సద్వినియోగం చేసుకున్నప్పుడే జీవితంలో ఉన్నతంగా ఎదుగుతామన్నారు. చెడు అలవాట్లకు లోనుకాకుండా, చదువును నిర్లక్ష్యం చేయకుండా మంచి ప్రణాళికతో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణ శిబిరంలో నిర్వహించిన డ్రాయింగ్, క్విజ్, డిబేట్, పేపర్ క్రాఫ్ట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. గ్రంథాలయాధికారి ఎన్‌సీహెచ్ రామకృష్ణ, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేగేశ్న సత్యరాజ్, గోపాలకృష్ణరాజు పాల్గొన్నారు.

పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు



గొంతువాపు వ్యాధి నివారణ టీకా వేస్తున్న మండల పశు వైద్యాధికారిణి కెల్లా భార్గవీ సత్య

ఆకివీడు: పశువుల్లో గొంతు వాపు వ్యాధి నివారణకు ముందు జాగ్రత్త చర్యలతో టీకాలు వేయడం ప్రారంభించినట్లు మండల పశు వైద్యాధికారిణి కెల్లా భార్గవీసత్య తెలిపారు. మండలంలోని అయిభీమవరంలో టీకాలు వేసే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించామని తెలిపారు. తేమ అధికంగా ఉండే ప్రాంతాల్లో వ్యాప్తి చెందే మల్టోసిడా అను సూక్ష్మ జీవుల వల్ల వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. కళ్లు ఎర్రబడటం, నీరు కారడం, నోటి నుంచి సొంగ కారడం, గొంతు క్రింది భాగంలో నొప్పులతో కూడిన వాపులు కలిగిన లక్షణాలుంటే గొంతువాపు వ్యాధి సంక్రమించినట్లేనన్నారు. వ్యాధి సోకిన పశువులు ఆహారం సక్రమంగా తీసుకోవని, వ్యాధి నిరోధక శక్తి పడిపోతుందని వైద్యురాలు భార్గవి అన్నారు. సరైన వైద్యం అందజేయకపోతే వ్యాధి సోకిన పశువు 48 గంటల్లో చనిపోయే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. ఆయా పశువైద్య కేంద్రాల్లో రైతులు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



తణుకులో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిస్తే వ్యాధులను నివారించుకోవచ్చని సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని మల్లికాసులపేట, 2వ వార్డు ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన డ్రైడే ఫ్రైడే, జాతీయ మలేరియా వ్యతిరేక దినోత్సవ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మలేరియా వ్యాధిపట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. చలి, వణుకుతో కూడిన జ్వరం ఉంటే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్యులకు చూపించుకోవాలని సూచించారు. దోమకాటు ద్వారా వ్యాపించే మలేరియా వ్యాధికి సొంత వైద్యం చేయరాదని, దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఒంటిని పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులు వేసుకోవాలని, నిద్ర సమయంలో దోమతెరలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. వారానికోసారి ఇంటి ఆవరణ శుభ్రం చేసుకుంటే దోమకాటు నుంచి తప్పించుకోవచ్చని వివరించారు. ఈసందర్భంగా అవగాహన కోసం ర్యాలీ నిర్వహించి స్థానిక నివాసితులకు జాగ్రత్తలు తెలిపే కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం సేవలను వినియోగించుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: దివ్యాంగ చిన్నారులకు భవిత కేంద్రాల్లో అందజేస్తున్న సేవలను వినియోగించుకోవాలని ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎస్‌కే.బాల ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కృష్ణాయపాలెం అంగన్‌వాడీ కేంద్రం.2లో దివ్యాంగ చిన్నారుల గుర్తింపుపై కరపత్రాల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో ప్రతీ బుధవారం ఫిజియోథెరపీ పరీక్షలు చేస్తారని, తద్వారా చిన్నారుల ప్రవర్తనలో మార్పు వస్తుందన్నారు. ఏఎన్‌ఎం సుభాషిణి మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా దోమలను నివారించవచ్చన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే. శ్రీదేవి మాట్లాడుతూ గర్భవతులు ఆరోగ్యవంతమైన శిశువుల కోసం ఆరోగ్య నియమాలు పాటించాలన్నారు. ఆహారంలో మినుములు, జొన్నలు, రాగులు వంటి చిరుధాన్యాలను తీసుకోవాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ సూపర్‌వైజర్ బాబ్జీ, ఆశా వర్కర్లు లక్ష్మీనారాయణమ్మ, పి.నాగమణి, అంగన్‌వాడీ టీచర్ పి.కనకదుర్గాంబ, గర్భవతులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

పంట కాలువ పనుల పరిశీలన

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని రాయలం గ్రామంలోని రక్షిత మంచినీటి చెరువుకు వెళ్లే పంటకాలువ పనులను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేసుకుందామని దానికి ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోళ్ల రామచంద్రరావు, కోళ్ల సీతారం, నాగబాబు, వినాయక్, సోమరాజు, పత్తి హరి, తదితరులు ఉన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీటీసీ): లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. అధ్యక్షుడు వంగపడు రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం పడాల గోసాలకు ట్రాక్టర్ గడ్డి, దాణా అందజేశారు. అదే విధంగా బ్యాంక్ కాలనీలోని నూతనంగా నిర్మించిన రామాలయానికి రూ 25,116 విరాళం అందజేశారు. దాతలు మదన్మోహన్ అగర్వాల్, అనిత అగర్వాల్, అమ్రిత అగర్వాల్ సహకరించారు. రామాలయంలో పూజలు జరిపారు. పదం కుమార్‌గుప్తా, సుంకర శ్రీనివాసరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఖరీఫ్ నారుమళ్లు



మోదుగ గుంట గ్రామంలో మాగ దమ్ము చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో ఖరీఫ్ దుక్కులు, నాట్లు వేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సమయంలో నాట్లు వేయడం వల్ల అధిక దిగుబడులు వస్తాయన్న నమ్మకంతో రైతులు సాగు పనులను వేగవంతం చేశారు. ఇప్పటికే 302 హెక్టార్లలో వరి నారుమడి పోశారు. బోర్ల కింద నారుమడి పోసి 21 రోజులు పూర్తి కావడంతో పుల్లాయగూడెం, కృష్ణాపురం, ఎల్.అగ్రహారం, నీలాద్రిపురం, కొమ్ముగూడెం, కడియద్ద తదితర గ్రామాల్లో నాట్లు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ప్రధానంగా పీఆర్‌పీ–126 రకం వరి వంగడాన్ని వేస్తున్నారు. మెట్ట ఉప్పరగూడెం, మాధవరం, మోదుగ గుంట, దండగర్ర తదితర గ్రామాల్లో మాగ దమ్ములు చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో నాట్లు పడే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ముందస్తు సాగు చేపట్టడం ద్వారా ప్రకృతి విపత్తుల నుంచి గట్టెక్కవచ్చని వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతాంగం ఖరీఫ్ సాగు పనులను ముమ్మరం చేశారు.

సాగు పనులు చేపట్టాలి



కాలువ కింద గ్రామాల్లోని రైతాంగం ఈ నెల 12వ తేది నుంచి ఖరీఫ్ నారుమడి పోసుకోవాలి. ఆలస్యమయ్యే కొద్ది పంట ప్రకృతి వైపరీత్యాల బారిన పడే అవకాశం ఉంది. సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాలద్వారా అందుబాటులో ఉన్నాయి.

– ఆర్ఎస్.ప్రసాద్, మండల వ్యవసాయాధికారి, తాడేపల్లిగూడెం

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఎంతో సురక్షితమని, ప్రయాణీకులు ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఆర్టీసీ లక్కీ డిప్‌లో భాగంగా ఏపీఎస్ ఆర్టీసీలో ప్రయాణించే ప్రయాణీకులకు ప్రోత్సాహక బహుమతులు శుక్రవారం అందజేశారు. జంగారెడ్డిగూడెం, ఆచంట, గణపవరం, భీమవరం రూట్లలో ఈ లక్కీడిప్ 15 రోజులకొకసారి నిర్వహిస్తుండగా దాతల సహాయ సహకారాలతో విజేతలకు బహుమతులు అందజేస్తున్నారు.

ఎల్.అగ్రహారంలో 104 వైద్య సేవలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఎల్.అగ్రహారం గ్రామంలో శుక్రవారం 104 వైద్య సేవల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు రూపాదేవి గ్రామంలోని రోగులకు సుగర్, బీపీ, రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరిగి కిడ్నీ, పక్షవాతంతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. దాదాపు 60 మందికి వైద్య సేవలు అందజేశారు.

గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలి

ఇరగవరం: తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఇరగవరం మండలం కె ఇల్లిందలపర్రు గ్రామంలో శుక్రవారం విలేజ్ హెల్త్ న్యూట్రిషన్, శానిటేషన్ డే ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి జిల్లా ఐసీడీఎస్ పీడీ బోళ్ల సుజాత రాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కేంద్రల్లో అందిస్తున్న రేషన్ తీసుకుని వారి పోషణ మెరుగు పరుచుకోవాలన్నారు.